# పోషణ



## 21

**సర్వజిత్**

"నీకేమయ్యా కొడుకూ కోడలూ రెండుచేతులా సంపాదిస్తున్నారు. అదీ డాలర్లలో...."

మిత్రుడు శ్రీనివాసరావు అనగానే రంగనాథం ముఖం మీదికి చిరునవ్వు తెచ్చుకున్నాడు.

\+ \+ \+

సాయంసంధ్యవేళ పొలాల మధ్య సన్నటి దారిలో వాహ్యాళిగా నడుచుకుంటూ ఇద్దరూ వెళుతున్నారు. అలా రోజూ వెళ్లడం వారిద్దరికీ అలవాటు.

దాదాపుగా ఇద్దరూ రెండేళ్ల వ్యవధిలో ఉద్యోగాల నుంచి పదవీ విరమణ చేశారు. రంగనాథం ఎమ్మార్వో కార్యాలయంలో హెడ్‌క్లార్క్‌గా పనిచేసి పదవీవిరమణ చేస్తే, శ్రీనివాసరావు ప్రైమరీ స్కూలు హెచ్.ఎమ్.గా పదవీవిరమణ చేశాడు.

అదే వాళ్ల సొంత ఊరు. ఇప్పుడిప్పుడే ఆ ఊరికి పట్నవాసపు వాసనలు గుబాళించడం ప్రారంభమయ్యాయి. ఉద్యోగాలు చేస్తున్న సమయంలో అప్పుడప్పుడూ సొంతూరికి వచ్చి కలుసుకున్నప్పుడూ, రిటైరయ్యాక రోజూ సాయంత్రాలు అలా గడపడం ఆ ఇద్దరికీ అలవాటుగా మారింది.

"ఓ నెలరోజులుంటాడా మీవాడు?" శ్రీనివాసరావు అడిగాడు.

"ఉంటాడు.... వాళ్లత్తారి ఇంట్లో నాల్రోజులు... ఇక్కడా.... మొత్తంమీద అటూ ఇటూగా నెలరోజులుంటాట్ట...." రంగనాథం చెప్పాడు.

"ఏమైనా నువ్వు అదృష్టవంతుడివోయ్ రంగనాథం... మీవాడు బుద్ధిమంతుడు. మాతో ఎంత వినయంగా మాట్లాడాడని!? మధ్యాహ్నం కనిపించాడు. నిన్ను కూడా అమెరికా తీసుకెళ్లిపోతా నంటున్నాడు. నీకీమధ్య ఒంట్లో బాగులేదని పాపం చాలా బాధపడి పోయాడు. హాయిగా వెళ్లిపోవోయ్. ఇంకెన్నాళ్లుంటావ్ - పల్లెగాని, పట్నంగాని ఈ ఊళ్లో? ఇక్కడే పుట్టాం. మధ్యలో ట్రాన్సఫర్లా అన్నీ పోను ఈ ఊళ్లో నలభయ్యేళ్లున్నామా...?"

"కచ్చితంగా ముప్పై అయిదేళ్లు పైమాటే...." రంగనాథం చెప్పాడు. ఆ రోజులు తలుచుకుంటూ.

"అవునా!.... ఇంకెంతకాలం ఇక్కడే ఉంటాం. అందుకే హాయిగా స్టేట్స్‌కి వెళ్లిపో. ఎలాగూ రిటైరయ్యావు కదా! శేషజీవితం స్వర్గధామం లాంటి అమెరికాలో గడిపెయ్....." శ్రీనివాసరావు ఉత్సాహంగా అన్నాడు.

రంగనాథం ఏమీ మాట్లాడలేదు. ముఖం మీదికి మళ్లీ చిరునవ్వు తెచ్చుకున్నాడు.

"పెన్షన్లూ... సొంత ఇల్లూ అంటూ ఏదో అనుకుంటాంగానీ, మనకి కాలూ చెయ్యీ కాస్త వంగే సమయానికి పిల్లల ఆసరా తప్పనిసరోయ్ రంగనాథం.... మీవాడు అంతగా రమ్మని అడుగు తుంటే జన్మభూమి అంటూ నాన్సెన్స్ సెంటిమెంట్లు పెట్టుకోక, నా మాట విని హాయిగా వెళ్లిపోవోయ్.... అసలే ఒంటిగాడివి... నీ వైఫ్ ఉంటే అది వేరే విషయం. ఆమె ఎలాగూ పైకి వెళ్లిపోయింది. ఎవరో వచ్చి వంటా వార్పూ చూసి పెడుతున్నా ఆ ముచ్చట ఎన్నాళ్లుంటుంది కనక.... నా మాట విని స్టేట్స్‌కి వెళ్లిపో...." శ్రీనివాసరావు సలహా ఇచ్చాడు.

దానికీ రంగనాథం ఏమీ మాట్లాడలేదు. ఏదో ఒక ప్రతిస్పందన చూపాలి గనక అవునన్నట్లు తల ఊపాడు. "నాకూ ఉన్నారు ఇద్దరు పిల్లలు. ఏం లాభం? మా ఆవిడ పోరుపెడితే మా పెద్దాడింటికి వెళ్లామనుకో.... మా కోడలు ఎక్కడలేని ఈతిబాధలూ ఏకరవుపెడుతుంది. మావాడు బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంటాడు. వెళ్లొస్తాంరా అంటే అలాగే అని బుర్రూపుతాడు తప్ప రెండ్రోజులు ఉండండి నాన్నా అని మాత్రం అనడు...." శ్రీనివాసరావు వాపోయాడు. క్షణం ఆగి మళ్లీ అన్నాడు.



"పోనీ ఆదాయం తక్కువా అంటే ఇద్దరూ కలిసి నెలకి ముప్ఫయి, నలభై వేలు సంపాదిస్తున్నారు. ఇక రెండోవాడున్నాడు. వాడింటికి వెళితే వాడు కంటికి కనపడడు. మా చిన్నకోడలు ఉడికీ ఉడకని అన్నం, చేశానన్నట్లు ఏదో కూర చేసి ఎక్కడికో వెళ్లిపోతుంది. ఎక్కడికెళ్లావమ్మా అని అడిగితే కోపం... అదో పెద్ద రాద్ధాంతం.... ఏం చెప్పమంటావులే మా వాళ్ల నిర్వాకం?... నా వైఫ్ ఊరికే బాధపడు తూంటుంది...." చివరి మాటలంటున్నప్పుడు శ్రీనివాసరావు కంఠం కొంచెం వణికింది.

అతడి పరిస్థితికి రంగనాథానికీ బాధగానే అనిపించింది.

"మనం పాతతరంవాళ్లం శ్రీనూ... ఆ ధోరణులు ఇప్పటివాళ్లకి సరిపడవు...." ఓదార్పుగా అన్నాడు రంగనాథం.

"అందరూ అలా ఎందుకుంటారు? మీవాడు చూడు అమ్మ పోయింది ఇక నాన్న ఒక్కడూ ఎంతకాలం ఉంటారిక్కడ?... నాన్న మాతోనే ఉండాలంకుల్... నేను తీసుకుపోతాను... అని కచ్చితంగా చెప్పాడు" శ్రీనివాసరావు అన్నాడు రంగనాథం ముఖంలోకి చూస్తూ.

అవునా అన్నట్టు కనుబొమలెగరేశాడు రంగనాథం.

"అవును రంగనాథం! మీవాడు అట్లా అంటున్నప్పుడు నాకెంత ముచ్చటేసిందో తెలుసా! తల్లిదండ్రులంటే పిల్లలకి ఆమాత్రం గౌరవం ఉండాలోయ్... వాళ్లని కని, పెంచి పెద్దచేసి వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడేట్లు చేసినందుకు మనల్ని వాళ్లు కనిపెట్టుకుని చూడాలంటావా వద్దా?" శ్రీనివాసరావు ఆవేశంగా అడిగాడు.

రంగనాథం వెంటనే ఏం మాట్లాడలేదు.

"ఎందుకు కన్నాం అన్న ప్రశ్నకు సమాధానం వెతుక్కోవడం అనవసరం శ్రీనూ... కానీ, కన్నందుకు పెంచి పెద్దచేయాల్సిన బాధ్యత మాత్రం మనకుంది..." రంగనాథం అన్నాడు.

"అవును! అందుకు నేను కాదనడంలేదు."

"కానీ, పెంచాం కదాని ఫలితం ఆశించే అధికారం కూడా మనకి లేదు...."

"అదేమిటి మళ్లీ... నువ్వూ నేనూ అలానే పెరిగామా?!"

"మన తరం వేరు.... ఇప్పటి తరం వేరు... మన పెంపకం వేరు... అప్పటి సమాజం వేరు... ఇప్పటి సమాజం వేరు...."

"అయితే మాత్రం అనుబంధాలెక్కడికి పోతాయ్?"

"అనుబంధాలు మారిపోతాయ్... ఇప్పుడు తండ్రీకొడుకులు, భార్యాభర్తల మధ్య ఉన్న సంబంధాలు కూడా వ్యాపారంగా మారిపోయాయ్ శ్రీనివాసరావ్...." ముఖం మీదికి నవ్వు తెచ్చుకుని మిత్రుడి ముఖంలోకి చూస్తూ అన్నాడు రంగనాథం.

అసహనంగా ముఖం పెట్టి : "నువ్విలా వెటకారంగా మాట్లాడకు" అన్నాడు శ్రీనివాసరావు.

"నీ గురించి నీ కొడుకు తపన పడుతున్నాడు. నువ్వెన్నయినా మాట్లాడతావ్. నా కడుపుమంట నీకేం తెలుస్తుంది?" అన్నాడు శ్రీనివాసరావు మళ్లీ.

రంగనాథం మౌనంగా విని ఊరుకున్నాడు. తన కొడుకు తపన ఎలాంటిదో తనకి తెలుసు.

'అమ్మ పోయింది. మీరా రిటైరయ్యారు.

ఒక్కళ్లూ ఎంతకాలం ఉంటారు? నాన్నా' మీరూ మాతోపాటు అమెరికా వచ్చెయ్యండి' వారం రోజుల క్రిందట కొడుకు కిరణ్ అన్న మాటలు గుర్తుకు వచ్చాయి రంగనాథానికి.

ఆ మాటకి రంగనాథం మురిసిపోయాడు. కళ్లలో ఆనందబాష్పాలు తిరిగాయి.

'కానీ ఒక్కటే సమస్య! అక్కడెలా గడుపుతారా అని....!' మళ్లీ హైమే అన్నది.

'ఎలా ఏంటి?!' కిరణ్ అడిగాడు.

'మనం పొద్దున్న పోయి రాత్రి ఏడింటికి గానీ ఇంటికి రాము కదా. పిల్లలూ అంతే.... అంటే పదిగంటలు మామయ్య ఒక్కరూ ఇంట్లోనే మగ్గిపోవాలి. భాష ప్రోబ్లమ్ సరేసరి... కనీసం పక్కింటివాడు చిరునవ్వైనా నవ్వడు. పోనీ అలా బజారుకి వెళ్లి వద్దామన్నా ఇక్కడిలా కాదు. పైగా సెక్యూరిటీ సమస్య....' హైమ చాలా నెమ్మదిగా వివరిస్తున్నట్లు చెప్పింది.

'అవును మనకంటే ఉద్యోగాలు తప్పదు బయటికి వెళ్లాలి మరి....'

'మరొకటి.... ఇక్కడిలా మనకిష్టమైన కూరలు, పచ్చళ్లు అక్కడేం తినగలరు?'

'ఏదో పదిపదిహేను రోజులంటే ఫర్వాలేదనుకో... కానీ కష్టం... మా నాన్నగారు ఏది పడితే అది తినలేరు.... తినరు....'

'అలాగని రోజూ చేయడానికి మనకి టైముండదు...'

'అదీ ప్రోబ్లమే... కానీ ఇక్కడ పెద్దాయన నాన్నగారిని వదిలి వెళ్లడమంటే నాకు బాధగా ఉంది మరి!' కిరణ్ బాధపడిపోయాడు.

'మీ మాట కాదనను.... ఇక్కడయితే ఇరుగిల్లు పొరుగిల్లు... బోల్డంత కాలక్షేపం. శ్రీనివాసరావు అంకుల్ లాంటి ఫ్రెండ్స్ ఉన్నారు....'

'అదీ నిజమే హైమా!'

'అదీగాక అప్పుడప్పుడు మీ చెల్లెలు వచ్చి వెళుతూంటుంది కూడాను'

'అవును కదా!'

'కానీ ఏజ్ వచ్చేసిన ఒంటరిగా ఉన్న మా నాన్నని ఇలా వదిలి మనం వెళ్లడం నాకు మనస్కరించడం లేదు హైమా....'

తనముందు కొడుకూ, కోడలూ అలా ప్రశ్నలూ, జవాబులూ వాళ్లే వేసుకుంటూ, వాళ్లే చెప్పేసుకుంటూ బోల్డు బాధని కుమ్మరిస్తుంటే రంగనాథం ఇక భరించలేకపోయాడు.

'ఫర్వాలేదమ్మా.... ముప్పై అయిదేళ్లుగా ఉంటున్న ఊరిది. దీన్ని విడిచి నేను ఎలా రాగలను? నా గురించి ఇంతసేపూ బాధపడిపోయి ఆలోచించారు. అదే చాలమ్మా నాకు.... అయినా నాకెంత ఏజ్ వచ్చేసిందని! జస్ట్ సిక్స్టీ ఎంటరయ్యింది. ఇంకా కాలూ, చెయ్యీ బాగానే ఆడుతున్నాయి' అన్నాడు.

'అదే నాన్నా సమస్య, మీకక్కడ ఒక్క గంట కూడా కాలక్షేపం కాదు...' కిరణ్ అన్నాడు.

'ఆ విషయంలో ఇంక నువ్వు బాధ పడకురా...' అనేసి అక్కడనుంచి లేచాడు రంగనాథం.

మామూలుగా తన కొడుకు తెలివైనవాడు. దానికితోడు పరిస్థితుల వల్లనైతేనేమి, మరెవరి వల్లనైతేనేమి లౌక్యం కూడా నేర్చుకున్నందుకు రంగనాథం నవ్వుకున్నాడు.



వారం క్రిందట జరిగిన ఆ సంఘటన కొద్దిక్షణాలు మనసులో మెదిలింది రంగనాథానికి.

"సరేనోయ్ రంగనాథం! నే వెళ్లొస్తాను మరి.... మరోసారి చెబుతున్నాను.... ముద్దొచ్చినప్పుడే చంకెక్కాలి. మీవాడు రమ్మన్నప్పుడే వెళ్లు...." అని చెప్పి తన ఇంటివైపు వెళ్లిపోయాడు శ్రీనివాసరావు.

నవ్వుకుంటూ రంగనాథం ఇంటికొచ్చాడు.

వారం క్రిందట భార్యను తీసుకుని అత్తింటికి వెళ్లిన కిరణ్, భార్యాపిల్లలు వచ్చారు. హాల్లో కూర్చుని అంతా టీవీ చూస్తున్నారు. రంగనాథం రాగానే టీవీ వాల్యూమ్ తగ్గించి, ఆయనకో కుర్చీ ఖాళీ చేసి ఇచ్చారు. వియ్యంకుడు, వియ్యపురాలు గురించిన కుశలప్రశ్నలు అయిన తరువాత టీవీ ఆఫ్ చేశాడు కిరణ్.

"నాన్నా ఇక్కడికి దగ్గరలో - మూడు కిలోమీటర్ల దూరంలోనే - మా ఫ్రెండు వాళ్ల ఫౌండేషన్ తరఫున ఒక వృద్ధాశ్రమం కట్టారు. అది ఎల్లుండి ఓపెనింగ్... అది నీ చేతులు మీదుగా చెయ్యాలంటున్నాడు మా ఫ్రెండు" అన్నాడు కిరణ్.

"నేనేంటిరా? ఎవరినైనా పెద్దవాళ్లని పిలవక?" రంగనాథం అన్నాడు.

"వాళ్లకలాంటి అట్టహాసాలు ఇష్టం ఉండదు. మీరే ఓపెనింగ్ చేయాలంటున్నాడు...." అంటూ ఫౌండేషన్ గురించి గొప్పగా చెప్పుకొచ్చాడు.

"సరే చూద్దాంలే..." రంగనాథం అన్నాడు చివరికి.

+ + +

"బావుందోయ్ వృద్ధాశ్రమం..." శ్రీనివాసరావు అన్నాడు మెచ్చుకోలుగా, ఆ ప్రదేశం తిరిగి చూశాక. పెద్దగా ఆర్భాటం లేదుగానీ, కొంచెం సందడిగానే ఉంది. మామిడితోరణాలు, రంగు రంగుల కాగితాల తోరణాలు కట్టారు. ఎవరెవరో కొందరు పెద్దలూ వచ్చారు.

అనుకున్న టైముకు రంగనాథం ప్రారంభోత్సవం చేశాడు. ఒకళ్లిద్దరు ఉపన్యాసాలు ఇచ్చారు. మొత్తం మీద ఆ కార్యక్రమం అంతా గంటలోపే ముగిసి పోయింది. అప్పటికే ఆరుగురు వృద్ధులు, వారిలో ఇద్దరు సతీసమేతంగా ఆశ్రమంలో చేరారు.

కిరణ్ ఫ్రెండు రంగనాథంగారికి కృతజ్ఞతలు తెలుపుతూ "అంకుల్! మీలాంటి పెద్దలు ఆశ్రమం బాధ్యతలు తీసుకుంటే బావుంటుంది. అఫ్‌కోర్స్ మేనేజర్ ఉన్నారనుకోండి" అన్నాడు.

రంగనాథం కొడుకు ముఖంలోకి చూశాడు.

"అంటే... పెద్దదిక్కుగానా?" తండ్రిచూపులు తప్పించుకుంటూ అడిగాడు ఫ్రెండుని కిరణ్.

"అంతే! అంతే!... మీరూ ఇక్కడ ఉంటే నాకు కొండంత తృప్తి. మంచి డాక్టర్ని, నర్స్‌ని కూడా ఏర్పాటు చేశాం. మీరూ ఒంటరిగా ఉన్నారు. పైగా పెద్దవాళ్లయిపోయారు కదా!...." చెప్పాడు కిరణ్ ఫ్రెండు.

రంగనాథానికి పరిస్థితి అర్థమయ్యింది. కొడుకు తనను లౌక్యంగా వృద్ధాశ్రమంలో చేరుస్తున్నాడని అర్థమయ్యింది. ఓ పేలవమైన నవ్వు ఆయన పెదవులపై కదలాడింది. తన స్నేహితుడు శ్రీనివాసరావువైపు చూశాడు.

రంగనాథం చూపులు తట్టుకోలేనట్లు తలదించుకున్నాడు శ్రీనివాసరావు.